సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం । 27 । జూలై । 2025



మరో ముందడుగు..

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

వివరాలు 8లో ▸



చిక్కని చిరుత

చిరుత సంచారం పాలమూరు పట్టణ ప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.9

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమయపాలన పాటించని వైద్యులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల: జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో సమయపాలన పాటించని వైద్యులపై జిల్లా వైద్యాధికారి చర్యలకు ఉపక్రమించారు. జిల్లా ఆస్పత్రితోపాటు పలు పీహెచ్‌సీలను శుక్రవారం 'సాక్షి' విజిట్ చేయగా.. పలువురు వైద్యులు, సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరుకావడంతో రోగులు గంటల పాటు వైద్యం కోసం నిరీక్షించారు. దీనిపై 'వైద్యం కోసం నిరీక్షణ' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో కథనానికి డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప స్పందించారు. సమయపాలన పాటించని గట్టు, అయిజ, మల్దకల్, అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాల పీహెచ్‌సీ మెడికల్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈమేరకు వివరణ కోరామని.. వారు ఇచ్చే వివరణల ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ 'సాక్షి'తో తెలిపారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

గద్వాల: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవి అన్నారు. శనివారం కలెక్టర్ బీఎం సంతోష్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, సీజనల్ వ్యాధులతోపాటు చికున్‌గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ.. కృష్ణా, తుంగభద్ర నదీపరివాహారక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని, తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టామని, క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలకు అవరమైన వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, డీఏవో సక్రియానాయక్, ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, డీపీవో నాగేంద్రం, డీఎస్‌వో స్వామికుమార్, ఉద్యానవనశాఖ అధికారి అక్బర్, డీఎస్పీ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

గద్వాల క్రైం: జిల్లా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిర తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ రెండు రోజుల క్రితం ఆస్పత్రికి రాగా వైద్య పరీక్షలు నిర్వహించామని, వైద్యులు అన్ని పరీక్షు నిర్వహించగా హెర్నియా అని గుర్తించారన్నారు. సదరు మహిళ కొన్నేళ్లుగా దీని వల్ల బాధపడుతూ ఉన్నారన్నారు. ఈమేరకు శనివారం ఏడుగురితో కూడిన వైద్య బృందం నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స చేశారన్నారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అలాగే, ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణి ఆరోగ్య పరిస్థితి సైతం విషమంగా ఉండగా వైద్య బృందం శస్త్రచికిత్స చేశారని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. శస్త్ర చికిత్సలో వైద్యులు విపంచి, కేచరి, విజయభాస్కర్, స్పందన, షఫి తదితరులు ఉన్నారన్నారు.

ఆగని మట్టి దందా..!

అనుమతుల్లేకుండానే ఎర్రమట్టి తరలింపు



సుల్తానాపురం శివారులోని గుట్టల నుంచి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న ఎర్రమట్టి

- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులు
- మైనింగ్ అధికారుల నివేదికలపై స్థానికంగా చర్చ

అలంపూర్: ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అలంపూర్ మండలంలోని సుల్తానాపురం, ర్యాలంపాడులోని ప్రభుత్వ గుట్టలే లక్ష్యంగా గత కొన్ని నెలలుగా ఎర్ర మట్టి తరలింపులు కొనసాగుతున్నాయి. కనీస అనుమతులు లేకుండానే మట్టి తరలింపులు కొనసాగిస్తున్నారు. నియంత్రించాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారుల ముందే భారీ వాహనాల ద్వారా తరలింపులు జరుగుతున్నా కట్టడి చేయడానికి చేపట్టే చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి.

రాత్రింబవళ్లు మట్టి తరలింపులు

సుల్తానాపురం గ్రామ శివారులోని 29/11 సర్వే నంబర్‌లోని గుట్టల నుంచి ఎర్రమట్టి తరలింపులు జోరుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి పగలు అక్రమార్కులు ఎర్రమట్టిని తరలిస్తున్నారు. రోజుకు 50 నుంచి 60 టిప్పర్ల ద్వార మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న అధికారులు సైతం భారీ స్థాయిలో మట్టి తరలివెళ్తున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం మిన్నకుండటంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు పరిశీలించినా..

ఎర్రమట్టి తరలింపుపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి ఇటీవల రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ర్యాలంపాడు, సుల్తానాపురం గుట్టలను పరిశీలించారు. దీంతో కొన్ని రోజులు తాత్కాలికంగా నిలిచాయి. ఆ తర్వాత యథావిధిగానే మట్టి తరలింపులు కొనసాగిస్తున్నారు. గుట్టల నుంచి తరలిన మట్టి వివరాలు ఇవ్వాలని జిల్లా మైనింగ్ అధికారులను రాష్ట్ర విజిలెన్స్ అధికారులు కోరినట్లు సమాచారం. ఆ మేరకు జిల్లా మైనింగ్ అధికారులు 648 మెట్రిక్ టన్నుల మేర మట్టి తవ్వకాలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులకు నివేదికలు ఇచ్చినట్లు తెలిసింది. కానీ స్థానికంగా మాత్రం ఈ నివేదికపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. 10 వేల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువగానే ఎర్రమట్టి తరలింపులు జరిగినట్లు స్థానికంగా చర్చకొనసాగుతుంది.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

అలంపూర్ మండలం ర్యాలంపాడు, సుల్తానాపురం గ్రామాల శివారు నుంచి ఎర్రమట్టి తరలింపునకు ఎలాంటి అనమతులు లేవు. అనుమతుల కోసం ఎవరూ మైనింగ్ శాఖను సంప్రదించలేదు. అక్రమంగా మట్టి తరలింపు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, మైనింగ్ ఆర్ఐ

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనమతులు లేకుండా భారీగా మట్టి తరలిస్తు అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఒక టిప్పర్ వంటి వాహనాలకు ప్రభుత్వం నుంచి 19.5 మెట్రిక్ టన్నుల వరకు పాసింగ్ లోడ్ అనుమతులు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో టిప్పర్ మట్టి తరలింపునకు ప్రభుత్వానికి రూ.900 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇవేవి లేకుండానే మట్టి తరలింపులు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వార మట్టిని తరలిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తుండటంతో స్థానికంగా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



టిప్పర్లలో మట్టి నింపుతున్న దృశ్యం

కేసుల్లో పురోగతి సాధించాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్



కోదండాపురం సీఐ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరుపడుతున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

గద్వాల క్రైం/ఎర్రవల్లి: కేసుల విచారణలో వీలైనంత త్వరగా పురోగతి సాధించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిందిగా జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. శనివారం వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని, ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం సిఐ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావుతో శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకున్న చర్యలు, సిబ్బంది పనితీరుపై, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులపై ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ కేసులు, నిషేధిత మత్తు పదార్థాలు, నకిలీ విత్తనాలు తదితర వాటికి సంబంధించి వివరాలు వాకబు చేశారు. విధుల్లో సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని, రెండు రాష్ట్రాల సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జిల్లాకు ప్రవేశపెట్టిన బడ్జెట్ నుంచి ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, వాటికి సంబంధించిన నివేదికలను పరిశీలించారు. అనంతరం జిల్లా సాయుధ బలగాల కార్యాలయం, గద్వాల రూరల్ పోలీసు స్టేషన్ డీఐజీ సందర్శించి స్టేషన్ సిబ్బందితో మాట్లాడారు.

■ అదేవిధంగా కోదండాపురం సిఐ కార్యాలయం ఆవరణలో డీఐజీ, ఎస్పీ మొక్కలు నాటారు. ప్రతి పోలీస్‌శాఖ భూములలో, పోలీస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఐజీ సూచించారు. సర్కిల్ పరిదిలోని అన్ని పీఎస్‌లలో డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. అలాగే బ్లూకోర్ట్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించేలా ఆయా ఎస్‌ఐలు చర్యలు చేపట్టాలని సిఐ రవిబాబుకి సూచించారు. డీఐజీ వెంట ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు మొగిలయ్య, నరేందర్‌రావు, సీఐలు నాగేశ్వరెడ్డి, శ్రీను, టాటాబాబు, రవిబాబు, ఎస్‌ఐలు శ్రీకాంత్, కళ్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జోగుళాంబ ఆలయ సన్నిధిలో డీఐజీ

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన అలంపూర్ జోగుళాంబ ఆలయాన్ని శనివారం డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, ఎస్పీ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం డీఐజీ, ఎస్పీ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు డీఎస్పీ మొగులయ్య, ఎస్ఐ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

'నెట్టెంపాడు' పెండింగ్ పనులు పూర్తిచేయాలి

గద్వాల: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియ, నిలిచిన సివిల్‌వర్క్సును పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పెండింగ్ పనులపై అధికారులతో సమీక్షించారు. నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కుడికాలువ పరిధిలో భూసేకరణ ప్రక్రియ చేయకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 99బీ, 100 ప్యాకేజీల కింద చేయాల్సిన భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ఆయా రైతులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి భూసేకరణను పూర్తి చేయాలన్నారు. సేకరణ అనంతరం అక్కడ చేపట్టాల్సిన సివిల్‌వర్క్స్ పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, ఎస్‌డీసీ శ్రీనివాస్‌రావు, ఇరిగేషన్‌శాఖ డీఈ, ఏఈలు, తహసీల్దార్ మల్లిఖార్జున్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలు ఆపడమే లక్ష్యం..

ప్రభుత్వ ఆసుపత్రులలో మాతృమరణాలు సంభవించకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని.. వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు కలిసి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బీఎం సంతోస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్పతో కలిసి గట్టు, ఇటిక్యాల పీహెచ్‌సీల వైద్యులు, వైద్యసిబ్బందితో సమీక్షించారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ఆర్‌ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్సను మాత్రమే అందించాలన్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వరాదని ఒకవేళ ఇస్తే అలాంటి ఆర్‌ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అయిజ మండలం బింగిదొడ్డి గ్రామంలో బాలింతకు ఆర్‌ఎంపీ డాక్టర్ ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా ఇంజక్షన్ చేయడంతో బాలింత మృతిచెందడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆర్‌ఎంపీ డాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనరాణి, డాక్టర్లు రమేష్, రాధిక, ఆరోగ్యశాఖ వైద్యసిబ్బంది తిరుమలేష్‌రెడ్డి, ఏఎస్‌వో నర్సయ్య హెల్త్‌అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఎర్రవల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని కొండేర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణ కొరకు గ్రామాల్లో నీరు నిలిచి ఉండే ప్రదేశాల్లో దోమలు పెరగకుండా కిరోసిన్ చల్లడం, దోమల మందు కొట్టడం, బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో అధిక కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే గర్భిణులను సురక్షితంగా జిల్లా ఆసుపత్రికి తరలించాలన్నారు. ప్రజలు కాచిన వేడి నీటిని తాగడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఏఈ ప్రియాంక, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

ఆట.. భవిష్యత్‌కు బాట

ఔత్సాహిక క్రీడాకారులకు వరం 'ఖేలో ఇండియా'

- ఉమ్మడి జిల్లాలో మూడు ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ సెంటర్లు
- శిక్షణ తీసుకుంటున్న వందలాది మంది విద్యార్థులు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకు..
- భవిష్యత్‌లో రెసిడెన్షియల్‌గా మార్చాలని వేడుకోలు

ఒకరు ఫుట్‌బాల్.. మరొకరు అథ్లెటిక్స్.. ఇంకొకరు కబడ్డీ.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో క్రీడల్లో రాణిస్తూ తమలోని ప్రతిభకు పదును పెడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఇలాంటి ఔత్సాహిక క్రీడాకారులకు వరంగా మారింది 'ఖేలో ఇండియా'. కేంద్ర ప్రభుత్వంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సెంటర్లు క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణకు వేదికగా నిలుస్తున్నాయి. ఈ సెంటర్లలో కోచ్‌లు, రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుతో ఔత్సాహిక క్రీడాకారులకు సువర్ణ అవకాశం లభించినట్లయింది.

– మహబూబ్‌నగర్ క్రీడలు



సండే స్పెషల్

ఉమ్మడి పాలమూరులోని ఐదు ప్రాంతాల్లో ఖేలో ఇండియా సెంటర్లు నడుస్తున్నాయి. ఇందులో వనపర్తి జిల్లా పెబ్బేరు పీజేపీ మైదానంలో ఫుట్‌బాల్, నారాయణపేటలో అథ్లెటిక్స్, మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో ఫుట్‌బాల్, గద్వాలలోని మైదానంలో ఫుట్‌బాల్, కల్వకుర్తి పట్టణంలో కబడ్డీ సెంటర్లు 2023లో ప్రారంభమయ్యాయి. ఈ సెంటర్లలో వందలాది మంది క్రీడాకారులు మెరుగైన క్రీడా శిక్షణ తీసుకుంటున్నారు. ఆయా కేంద్రాల్లో శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

అన్నతో కలిసి ఫుట్‌బాల్ శిక్షణ

అన్న కూడా ఫుట్‌బాల్ క్రీడాకారుడు. నేను ఏడాది నుంచి అన్నతో కలిసి శిక్షణ తీసుకుంటున్న. ఫార్వర్డ్ స్థానంలో ఆడుతున్న. మెదక్, మంచిర్యాలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొన్న. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్న.

– అయేషా ఫిర్దోస్, మహబూబ్‌నగర్



గద్వాల సోమనాద్రి స్టేడియంలో క్రీడాకారుల ప్రాక్టీస్

సెంటర్లు ఎక్కడెక్కడంటే..

■ మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలోని ఫుట్‌బాల్ సెంటర్‌లో దాదాపు 30 నుంచి 35 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. కోచ్ నికేష్ క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం ఫిట్‌నెస్, స్పీడ్ బాల్, సాయంత్రం వేళల్లో గేమ్ ప్రాక్టిస్ చేయిస్తున్నారు. అదేవిధంగా ప్రతి శని, ఆదివారాలు క్రీడాకారులకు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

■ ఉమ్మడి జిల్లాలోనే ఫుట్‌బాల్‌కు ప్రత్యేక గుర్తింపు పొందిన గద్వాలలోని సోమనాద్రి మినీ స్టేడియంలో దాదాపు 50కిపైగా క్రీడాకారులు ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. కోచ్ శ్రీనివాసరావు క్రీడాకారులకు శిక్షణ అందజేస్తున్నారు. ఉదయం ఫిట్‌నెస్, షటిల్ రన్ ట్రెనింగ్, సాయంత్రం వేళల్లో గేమ్ ప్రాక్టీస్ చేయిస్తున్నారు. సెంటర్‌లో శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు అంతర్ జిల్లాతో **పాటు పలు టోర్నీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నారు.**

■ వనపర్తి జిల్లా పెబ్బేరులోని పీజేపీ మైదానంలో ఖేలో ఇండియా ఫుట్‌బాల్ సెంటర్‌లో కోచ్ నాగరాజు దాదాపు 40 మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు నెలలో రెండు లేదా మూడు సార్లు ఇతర జట్లతో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

■ కల్వకుర్తి పట్టణంలోని ఖేలో ఇండియా సెంటర్‌లో కోచ్ గణేష్ 30 మంది క్రీడాకారులకు కబడ్డీ శిక్షణ ఇస్తున్నారు. ఉదయం ఫిట్‌నెస్, టెక్నిక్ అంశాలు, సాయంత్రం మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు.

■ నారాయణపేట పట్టణంలోని ఖేలో ఇండియా సెంటర్‌లో సీనియర్ అథ్లెట్ కోచ్ హారికాదేవి 34 మంది క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం సీనియర్లకు 100 మీ., 200 మీ., 800 మీ., 1500 మీటర్ల పరుగులో మెళకువలు నేర్పిస్తున్నారు. చిన్నారులకు ల్యాడర్ రన్, డ్రిల్స్, షటిల్‌రన్ నిర్వహించారు. సాయంత్రం ఫిట్‌నెస్, వార్మప్ అనంతరం హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్, షాట్‌పుట్ త్రోలో శిక్షణ ఇస్తున్నారు.




ఢిల్లీ క్లబ్ జట్టుకు ఎంపిక

2022 నుంచి ఫుట్‌బాల్ ఆడుతున్న. ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రత్యేక **శిక్షణ తీసుకుంటు**న్న. 2023లో జడ్చర్ల, 2024లో ఖమ్మంలో ఎస్‌జీఎఫ్‌ఐ **అండర్**–17 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలు ఆడాను. గతేడాది **డిసెంబర్‌**లో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 **ఫుట్‌బాల్** పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఈ **నెల 20న ఢిల్లీ** నోయిడాలో జరిగిన అండర్–19 యూత్ లీగ్‌కు ఎం**పికయ్యా. 90** మినిట్స్ ఫుట్‌బాల్ క్లబ్ తరపున సెప్టెంబర్‌లో జరిగే **లీగ్‌లో ఆడుతా.** స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– కాట్రావత్ మహేష్, జైనల్లీపూర్ తువ్వగడ్డతండా


శిక్షణపై ఆసక్తి..



ఖేలో ఇండియా సెంటర్ రావడంతో ఫుట్‌బాల్ శిక్షణపై ఆసక్తి, పిల్లల్లో నేర్చుకునే తత్వం పెరిగింది. సెంటర్‌లో 35 మంది శిక్షణ తీసుకుంటున్నారు. వీరిలో కొందరు రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భవిష్యత్‌లో ఖేలో ఇండియా సెంటర్లను రెసిడెన్షియల్‌గా మారిస్తే నైపుణ్యం గల క్రీడాకారుల ను వెలికితీయవచ్చు.

– డి.నికేష్, ఖేలో ఇండియా సెంటర్, ఫుట్‌బాల్ కోచ్, మహబూబ్‌నగర్

జిల్లాకు ప్రాతినిధ్యం



రెండేళ్ల నుంచి ఫుట్‌బాల్ శిక్షణ తీసుకుంటున్న. మ్యాచ్‌లో మిడ్ ఫీల్డర్‌గా ఆడుతున్న. 2024లో వనపర్తి పట్టణంలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 టోర్నీలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాను. హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లోనూ ఆడాను.

– భానుప్రకాశ్, పెబ్బేర్

సద్వినియోగం చేసుకోవాలి..



ఖేలో ఇండియా సెంటర్ క్రీడాకారులకు మంచి అవకాశం. క్రీడాకారులు దీనిని సద్విని యోగం చేసుకోవాలి. గ్రామీణస్థాయి నుంచి ఫుట్‌బాల్ నేర్చుకోవడానికి మా సెంటర్‌కు వస్తున్నారు. క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– నాగరాజు, కోచ్, పీజేపీ ఖేలో ఇండియా ఫుట్‌బాల్ సెంటర్

క్లుప్తంగా

దుందుభీ వాగులో పడి వృద్ధుడి మృతి


జంగయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట–రామగిరి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న దుందుభి వాగులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. తెలకపల్లి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సొంట పెద్ద జంగయ్య (65) ఊరుకొండపేటకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. కుటుంబ సభ్యులు శ్రావణ మాసం సందర్భంగా ఊరుకొండపేట ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం కోసం శుక్రవారం రాత్రి వెళ్లారు. శనివారం ఉదయం మృతుడు గ్రామం నుంచి కాలినడకన ఊరుకొండపేటకు వెళ్తుండగా దుందుభి నది వాగు దాటే క్రమంలో ఫిట్స్ రావడంతో నీళ్లలో పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు అతడి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలో కరెంటు షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... పెబ్బేరు పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్న తోక సురేష్ (36) కొత్తగా ఇంటి నిర్మాణ చేపట్టడంతో గోడలకు నీళ్లు పట్టి తడి చేతితోనే మోటార్‌ను ఆఫ్ చేశాడు. ఈ క్రమంలో అరచేతికి ప్రమాదవశాత్తు కరెంటు వైర్ తగిలి షాక్ కొట్టడంతో సంపు దగ్గర పడిపోయాడు. కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేయగా అంబులెన్సు సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్, డీసీఎం ఢీ.. యువకుడు దుర్మరణం


సాహేల్ (28) ఫైల్

కొత్తకోట రూరల్: డీసీఎం, బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం అర్ధరాత్రి కనిమెట్ట జాతీయరహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తకోటకు చెందిన సాహేల్ (28) గ్యాస్ పిట్టింగ్‌గా పనిచేస్తుండేవాడు. ఈనెల 25న గ్యాస్ పిట్టింగ్ కోసం భూత్పూర్ మండలం అన్నసాగర్‌లో పనిచేసేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొత్తకోటకు వస్తుండగా మార్గమధ్యలో అడ్డాకుల మండలం పెద్దమునగల్‌చేడ్ గ్రామానికి చెందిన తయ్యబ్‌ను బైక్‌పై ఎక్కించుకుని వస్తుండగా పాలెం సమీపంలో డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో సాహేల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించగా తయ్యబ్‌కు గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి హారీఫ్‌మియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

వనపర్తి రూరల్: లారీ బైక్‌ను ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన శనివారం వనపర్తి పట్టణ శివారులోని చోటు చేసుకున్నది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండలం, చెన్నూర్ గ్రామానికి చెందిన భాస్కర్(25) బైక్‌పై మండలంలోని చిట్యాల గ్రామానికి వెళ్తుండగా శ్రీ చైతన్య పాఠశాలకు ఎదురుగా వనపర్తి వైపు వస్తున్న లారీ ఎదురుగా బైక్‌ను ఢీకొనడంతో భాస్కర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని 108 అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని నెమలి మృతి



చారకొండ: మండలంలోని జూపల్లి సమీపాన జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం తగిలి శనివారం నెమలి మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్‌ఐ శంషోద్దిన్ ఫారెస్టు బీట్ ఆఫీసర్ వెంకటరమణకు సమాచారం అందించడంతో ఫారెస్టు అధికారులు ఘటన స్థలానికి చేరుకొని.. మృతి చెందిన నెమలిని పరిశీలించారు. నెమలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మండలంలోని కమాల్‌పూర్ ఫారెస్టులో పూడ్చినట్లు బీట్ ఆఫీసర్ వెంకటరమణ పేర్కొన్నారు.

మరో ముందడుగు..

సర్కారు బడుల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్స్

పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా.. ప్రభావవంతంగా బోధిస్తేనే విద్యార్థులకు బాగా అర్థమై చిరకాలం గుర్తుండిపోతాయి. ఇదే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పాఠశాలలో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీని ఉపయోగించుకొని పాఠ్యాంశాలను.. కంటెంట్‌ను త్రీడీ రూపంలో మార్చి బోధించనున్నారు. గుండె పనితీరు, రక్తనాళాలు, మానవ శరీరంలో అవయవాలు.. ఇలా ప్రతి అంశం విద్యార్థులు హెడ్‌గెయిర్ సాయంతో చూడడంతో కళ్లెదుట ప్రతి అంశం కనిపిస్తూ.. ప్రత్యక్ష అనుభూతి పొందుతూ సులభంగా అర్థం చేసుకోగలరు. – నారాయణపేట రూరల్


కోటకొండ పీఎం శ్రీ పాఠశాల

- సాంకేతిక విద్య అమలుకు శ్రీకారం
- ప్రతి సబ్జెక్టుకు అనుసంధానం
- విద్యార్థులకు ప్రత్యక్ష అనుభూతి
- ఉమ్మడి జిల్లాలో 29 పాఠశాలలు ఎంపిక

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన పాఠశాలలు

జిల్లా	పాఠశాలలు
మహబూబ్‌నగర్	8
జోగులాంబ గద్వాల	6
నాగర్‌కర్నూల్	6
నారాయణపేట	5
వనపర్తి	4

ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వాలు ఏటా సరికొత్త ఒరవడితో ముందుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందుకుగాను ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేసి వాటిని సాంకేతిక పరిశోధన కేంద్రాలుగా మారుస్తున్నారు. ఆయా బడులకు ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు, కనీస వసతి సౌకర్యాల కోసం కేంద్రం అవసరమైన నిధులు మంజూరు చేస్తుంది. కొత్తగా అగ్మెంటెడ్ రియాల్టీ (ఏఆర్), వర్చువల్ రియాల్టీ వీఆర్) ల్యాబోరేటరీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 29 పీఎంశ్రీ స్కూళ్లను ఎంపిక చేశారు.

పైలెట్ ప్రాజెక్టులో 29 పాఠశాలలు..

పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన ప్రతి పాఠశాలకు 10 ఏఆర్, వీఆర్ పరికరాలు, ఒక బీన్ బ్యాగ్, చార్జింగ్ ట్రాలీ, రెండు ట్యాబ్‌లు, ఒక స్టోరేజ్ కేస్, కేవీఏ యూపీఎస్ పరికరాలతో ల్యాబ్ గదిలో అమర్చనున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్ తదితర ఆప్షనల్ సబ్జెక్టులను బోధించడానికి ఉపాధ్యాయులకు సులువుగా ఉంటుంది. విద్యార్థులు సైతం నేర్చుకోవడానికి అనుకూలంగా ఉండనుంది. ఇదిలాఉండగా, వీఆర్ హెడ్ గేర్ రాష్ట్ర పాఠ్యాంశాలకు మ్యాప్ చేసిన కంటెంట్ లోడ్ చేస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఇంటరాక్టివ్, 5 డీ (ప్రస్తుత టెక్నాలజీ) మోడ్ తో పాఠాలను నేర్చుకోగలుగుతారు. గుండె పనితీరును బోధించే సమయంలో ఉపాధ్యాయులు బోర్డుపై హృదయ రేఖాచిత్రాన్ని గీసి చూపించాలి. వీఆర్ ఆధారిత అభ్యాసం విషయంలో హెడ్ గేర్ లో ఉపయోగించడంతో త్రీడీలో హృదయం తెరపై కనిపిస్తుంది. మనిషి అవయవాల పనితీరు విద్యార్థులు చూడడంతో పాటు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.



సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాల పరిధిలో ఎంపిక చేసిన స్కూళ్లకు ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పరికరాలు సైతం వస్తున్నాయి. ఇందుకు సంబంధించి పూర్తి గైడ్ లైన్స్ జారీ చేశాం. మెటీరియల్ వినియోగం, నిర్వహణ కోసం పాఠశాలల్లోని ఫిజిక్స్, బయాలజీ టీచర్లను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తాం. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ల్యాబ్ పరికరాలు వచ్చిన వెంటనే హెచ్‌ఎంలు జాగ్రత్తగా పరిశీలించుకొని వాటిని ఉపయోగించుకోవాలి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– విద్యాసాగర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి, నారాయణపేట

బోధనతో ప్రయోజనాలు..

ఏఆర్, వీఆర్ ల్యాబ్ లతో సోషల్ సబ్జెక్టు సంబంధించి ఖగోళ శాస్త్రం, రెండవ ప్రపంచ యుద్ధం, పూర్వ కాలం నాటి చరిత్రలకు సంబంధించిన పాఠ్యాంశాల బోధన చాలా చక్కగా అర్థమవనుంది. అదేవిధంగా బయాలజీలో గుండె పనితీరు, మానవ శరీరంలోని అవయవాల కదలికలు సంబంధించిన బోధన విద్యార్థులకు ప్రత్యక్ష అనుభూతికి లోనవుతారు. వెనకబడిన విద్యార్థులకు బాగా చదువుకునే తోటి స్నేహితుల వరకు ఏఆర్, వీఆర్ బోధనా పరికరాలతో టీచర్ చెప్పే విషయాలను శ్రద్ధగా వినేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు గుండె, కణాల నిర్మాణం, వాటి విధులు, జీవశాస్త్ర, ఆస్ట్రానమీ, ఫిజిక్స్, గణితం తో పాటు గతంలోకి వెళ్లి హిస్టరీ పాఠాలను ఇమ్మర్సివ్, ఇంటరాక్టివ్ టెక్నాలజీలను ఉపయోగించి వీఆర్ ద్వారా వాటిలోకి ప్రవేశించి స్వీయ అనుభవంతో నేర్చుకుంటారు.

జూరాలకు 75 వేల క్యూసెక్కులు

9 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 7 గంటల సమయంలో 75 వేల క్యూసెక్కులకు చేరిందన్నారు. దీంతో 9 క్రస్ట్‌గేట్లు పైకెత్తి 35,820 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 34,286 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 480, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 200, సమాంతర కాల్వకు 200, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.991 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.


జూరాల జలాశయంలో నీటిమట్టం

సుంకేసులలో ఎనిమిది గేట్లు ఎత్తి..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో అధికారులు ఎనిమిది గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం జలాశయానికి 36 వేల క్యూసెక్కుల వరద రాగా.. 32,808 క్యూసెక్కులు దిగువకు, 1,847 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

353.150 మి.యూ. విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. శనివారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 161.595 మి.యూ, దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 191.555 మి.యూ. ఉత్పత్తి చేపట్టామని వివరించారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 353.150 మి.యూ. విద్యుదుత్పత్తి విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు.

మెకానిక్ షాపుల్లో చోరీ


ఉదండాపురంలో చోరీ జరిగిన షాపులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్


మల్దకల్‌లో దొంగతనం జరిగిన మెకానిక్ షాపును పరిశీలిస్తున్న పోలీసులు

మల్దకల్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రంగప్ప, నన్నుపాష, తిమ్మప్పగౌడ్‌లకు చెందిన మోటార్ మెకానిక్ షాపుల్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. షాపుల్లో ఉన్న రూ.1.20లక్షల నగదుతో పాటు, విద్యుత్ మోటార్లు, మోటార్ వైడింగ్ కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. రోజులాగే సాయంత్రం యజమానులు షాపులను మూసి వెళ్లగా.. మధ్యరాత్రి షాపు వెనకాల ఉన్న రేకులను కట్ చేసి లోపలికి వెళ్లారని బాధితులు వాపోయారు. అపహరించిన వాటి విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందన్నారు. ఘటనపై బాధితులు రంగప్ప పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఇప్పటికైనా పోలీసులు రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేయడంతో పాటు దొంగతనాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇటిక్యాల: గుర్తు తెలియని దుండగులు రెండు షాపుల్లో చోరీ చేసిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి, ఖాజామియా కు చెందిన వివిధ షాపుల్లోకి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షాపు రేకులను తొలగించి లోపలికి ప్రవేశించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆయా షాపుల్లో దాచుకున్న రూ.10వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. శనివారం గమనించిన షాపుల యజమానులు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

మాగనూర్: కుక్కల దాడిలో జింక మృతిచెందిన ఘటన మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మాగనూర్ శివారులోని ఓ రైతు పొలం సమీపంలో గడ్డి మేస్తున్న జింకపై కుక్కలు దాడిచేశాయి. సమీపంలోని రైతులు గమనించి జింకను విడిపించే ప్రయత్నం చేయగా.. కుక్కలు రైతుల వెంట పడడంతో వారు తప్పించుకున్నారు. ఈ ప్రాంతంలో వందలాది జింకలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ప్రదేశంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వీటితో రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించి జింకల పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అలంపూర్ ఆలయాల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్: అలంపూర్ ఆలయాలను శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు కుటుంబ సమేతంగా, స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి మిథున్‌తేజ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికి జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామికి పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం పలికి శేష వస్త్రాలతో సత్కరించారు. వారి వెంట స్థానిక కోర్టు అధికారులు ఉన్నారు.

నిన్న అదృశ్యం.. నేడు మృతదేహం


మండ్ల నర్సింహ (ఫైల్)

గోపాల్‌పేట: శుక్రవారం కనిపించకుండా పోయిన మనిషి శనివారం మృతదేహంగా కనిపించాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం కేశంపేటలో చోటుచేసుకుంది. రేవల్లి హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట గ్రామానికి చెందిన మండ్ల నర్సింహ(70) శుక్రవారం బయటకు వెళ్తున్నానని చెప్పి పోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. ఎక్కడా వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో శుక్రవారం రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం కౌలుకు చేస్తున్న పొలంలో కుటుంబ సభ్యులకు నర్సింహ మృతదేహం కనిపించింది. గతంలో నర్సింహకు ఫిట్స్ వచ్చేది. దాన్ని వల్లనే మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు చెప్పడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై డీసీఎం ఢీకొని ఒకరు దుర్మరణం చెందగా.. ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ మురళి కథనం మేరకు.. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన బొగ్గు నరసింహులు (32) తన బొలెరో వాహనంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి శనివారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేముల స్టేజీ సమీపంలో పౌల్ట్రీఫామ్‌కు చెందని బొలెరో వాహనం టైరు పేలి రోడ్డు పక్కన ఆగి ఉండటాన్ని గమనించి, టైరు మార్చడంలో వారికి సహాయం చేస్తున్నాడు. ఇదే సమయంలో డీసీఎం అతి వేగంగా వచ్చి టైరు మారుస్తున్న వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బొగ్గు నరసింహులు అక్కడికక్కడే మృతి చెందగా.. పౌల్ట్రీఫామ్ బొలెరో డ్రైవర్ మహబూబ్‌బాష, క్లీనర్ ఇబ్రహీం రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బొగ్గు శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి ఉత్సవాలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


స్వామివారి కళ్యాణం

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారులోని తిరుమలయ్యగట్టుపై వెలసిన తిరుమల వేంకటేశ్వరుడి ప్రతిరూపంగా భావించి కొలిచే తిరుమలనాథ స్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శ్రావణమాసంలో మొదటి శనివారం ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకంగా అలంకరణ చేసి అర్చనలు, కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తుల కోసం దాతలు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులతో తినుబండారాల గుడారాలు కళకళలాడాయి. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీబందోబస్తు నిర్వహించారు.

కురుమూర్తిస్వామి హుండీ ఆదాయం రూ.7.56లక్షలు


కురుమూర్తిస్వామి హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం శివారులో వెలసిన కురుమూర్తిస్వామికి అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని భక్తులు హుండీలో వేసిన కానుకలను శనివారం ఆలయ సిబ్బంది లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.7.56లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పరిశీలకులు శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, భారతమ్మ, నాగరాజు, శేఖర్, కమలాకర్, రాములు, ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, అనంత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బడిగుచ్చతండాలో జ్వరాలు


గుబ్బడిగుచ్చతండాలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది


తండావాసులకు వ్యాధులపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

- ఆస్పత్రి పాలవుతున్న గిరిజనులు
- డెంగీ లక్షణాలున్నట్లు గుర్తించిన వైద్యులు
- తండాలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టిన సిబ్బంది

నవాబుపేట: మండలంలోని గుబ్బడిగుచ్చతండాలో జ్వరాలు గిరిజనులకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. తండాకు చెందిన ముగ్గురు శనివారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో చేరారు. కాగా జ్వరాలు వచ్చిన వారందరికీ ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, వారందరికీ డెంగీ లక్షణాలున్నట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో శనివారం మండల వైద్య సిబ్బంది తండాలో పర్యటించి అందరి ఇళ్లల్లో దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. అలాగే వీధులను శుభ్రం చేయడంతోపాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కాగా తండాలో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరం ఉన్నవారికి మందులు అందజేశారు. జ్వరం తీవ్రంగా ఉంటే పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, రామేశ్వరి, శ్రీనివాస్, రాములు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో అన్నిరకాల సైబర్ నేరాలు పెరిగాయని.. వారంలో 18 ఫిర్యాదులు వచ్చాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో కోరారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఉన్న వారిని సైబర్ నేరగాళ్లు ఉచ్చులోకి దించి నగదు కాజేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, రుణాలు, నకిలీ పోలీస్ వంటి వాటితో మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు గమనించాలని సూచించారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రెడిట్‌కార్డు లిమిట్ పేరుతో రూ.50 వేలు, బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 డేస్ లోన్‌యాప్ పేరుతో మోసాలు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నటరాజ్ పెన్సిల్స్ జాబ్ ఆఫర్ పేరుతో ఒక్కొక్కరితో రూ.5 వేలు వసూలు చేశారని, టెలిగ్రామ్ పేరుతో రూ.15 వేలు, జడ్చర్లలో లాటరీ పేరుతో రూ.40 వేలు, దేవరకద్రలో భర్తపై కేసు నమోదు చేశామని రూ.10 వేలు, జడ్చర్ల పరిధిలో పీఎం కిసాన్ ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేయడంతో రూ.19 వేలు మాయం చేశారని చెప్పారు. సైబర్ నేరగాళ్లు కొత్తరకం నేరాలకు శ్రీకారం చుడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.